క్లుప్తంగా

నేడు మంత్రి సీతక్క రాక

లోకేశ్వరం: మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కుమురం భీం విగ్రహ ప్రతిష్ఠాపన చేసేందుకు మంగళవారం ఉదయం 11 గంటలకు మంత్రి సీతక్క రానున్నట్లు మండల న్యాకపోడ్ ఆదివాసీ మండల అధ్యక్షుడు రాజేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

బాసర: బాసరలో ఈనెల 27న ఉదయం 10.30లకు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు డివిజనల్ ఇంజనీర్ అధికారి శ్రీనివాస్ రెడ్డి సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ టీజీఈఆర్‌ఎఫ్ చైర్మన్ నారాయణ హాజరవుతున్నారని పేర్కొన్నారు. బాసర మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు.

29న వక్ఫ్‌బోర్డు భూముల వేలం

బాసర: మండల పరిధిలోని వక్ఫ్‌బోర్డుకు చెందిన వ్యవసాయ భూములను ఈనెల 29న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పవన్ చంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు వేలం ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. సంవత్సరం కాల పరిమితితో కూడిన వక్ఫ్ బోర్డు భూముల వేలం పాటలో పాల్గొనేందుకు తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేద ప్రజలకు మేలు

కడెం: సీఎంఆర్‌ఎఫ్‌తో పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండలంలోని ఉడుంపూర్ గ్రామానికి చెందిన పూదరి లక్ష్మికి చెందిన రూ. 19 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును సోమవారం ఉట్నూర్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బొజ్జు కుటుంబసభ్యులకు అందజేశారు.

ఆర్థిక సాయం




ఆర్థిక సాయం చేస్తున్న చిన్నారులు

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ గ్రామానికి చెందిన శరణ్యకు ఆర్థిక సాయం అందచేశారు. పేగుల్లో ఇన్ఫెక్షన్ సోకి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. రోజుకు లక్ష వరకు ఖర్చు అవుతుంది. నిరుపేద కావడంతో అంత డబ్బులు పెట్టే స్థోమత లేదు. వడ్యాల్ గ్రామానికి చెందిన గంధం సాయన్న మనుమరాళ్లు సంధ్య, కావేరి, మనుమడు సుభాష్‌లకు వారికి తల్లిదండ్రులు ఖర్చుల కోసం ఇచ్చిన డబ్బులలో పోగు చేసిన డబ్బులరు రూ.10 వేలు సోమవారం నిర్మల్‌లోని ఆసుపత్రికి వెళ్లి అక్కడ శరణ్యను పరామర్శించి అందజేశారు. చిన్న వయస్సులో పెద్ద మనస్సు చాటుకున్న ముగ్గురిని వడ్యాల్ వాసులతో పాటు మండల వాసులు అభినందిస్తున్నారు.

మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు

భైంసాటౌన్: విద్యార్థులు పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని భైంసా జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కరోల్ల బుచ్చయ్య హెచ్చరించారు. సోమవారం జరిగిన ఆరో సెమిస్టర్ పరీక్షల్లో 8 మంది విద్యార్థులు, రెండో సెమిస్టర్ పరీక్షలో ముగ్గురు విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడగా, వారిని బుక్ చేసినట్లు తెలిపారు. విద్యార్థులు చదువుకుని పరీక్షలకు హాజరు కావాలని సూచించారు.

పూడిక తొలగింపు



పూడిక తీస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

భైంసాటౌన్: పట్టణంలోని పలు డ్రెయినేజీల్లో పూడిక పేరుకుపోయి రోడ్డుపై మురుగునీరు చేరుతోంది. దీంతో 'సాక్షి'లో ఈ విషయమై కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. స్థానిక గణేశ్‌నగర్ వద్ద జేసీబీతో డ్రెయినేజీలో పూడికను తొలగించారు. అలాగే టీఎన్జీవోస్ కాలనీ వద్ద జేసీబీతో పూడిక తీశారు. దీంతో ఆయా కాలనీవాసులు 'సాక్షి'కి ధన్యవాదాలు తెలిపారు.

స్థల పరిశీలన

లోకేశ్వరం: మండల కేంద్రంలోని ఆదివాసీ న్యాకపోడ్ ఆధ్వర్యంలో నిర్వహించే కుమురం భీం విగ్రహాన్ని ఆవిష్కరించే స్థలాన్ని భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ పరిశీలించారు. మంత్రి సీతక్క పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎస్సై అశోక్, ఏఎ స్సై దిగంబర్, రాజేశ్వర్, గంగాధర్ పాల్గొన్నారు.

ఆసుపత్రిలో మౌలిక వసతులు



భైంసా ఏరియాస్పత్రి

- టీవీవీపీ బ్రాండింగ్ కింద భైంసా ఆస్పత్రి ఎంపిక
- త్వరలో కార్పొరేట్ స్థాయిలో ఏర్పాటు

భైంసాటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియాస్పత్రిలో మౌలిక వసతుల కొరత తీరనుంది. ఈ మేరకు ప్రైవేట్ కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా అన్ని ఆధునిక హంగులతో రూపుదిద్దుకోనుంది. ఇందుకు ప్రభుత్వం టీవీవీపీ బ్రాండింగ్ పథకం కింద భైంసా ఏరియాస్పత్రిని ఎంపిక చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 40 ప్రభుత్వ ఆస్పత్రులను ఎంపిక చేయగా, జిల్లా నుంచి భైంసా ఏరియాస్పత్రికి అవకాశం దక్కింది. తెలంగాణ స్టేట్ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కార్పొరేట్ ఆస్పత్రుల్లో మాదిరి మౌలిక వసతులు, సుందరీకరణ, ఆధునీకరణ పనులు చేపట్టనున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతులు మెరుగుపర్చడం, రోగులకు అనుకూలమైన వాతావరణం కల్పించడం, సేవల్లో నాణ్యత పెంచడం ఈ పథకం ఉద్దేశం. ఈ మేరకు టీఎస్ఎంఐడీసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఆస్పత్రిలో అవసరమైన మౌలిక వసతుల కల్పన, సుందరీకరణ, పార్కింగ్, ఓపీ, ఐపీ బ్యూటిఫికేషన్, ఫైర్ సేఫ్టీ, గార్డెనింగ్, తదితర పనులు గుర్తిస్తున్నారు. ఈ మేరకు నివేదిక రూపొందించి ప్రభుత్వానికి నివేదించనున్నారు.

సమస్యలతో సతమతం...

ప్రస్తుతం ఏరియాస్పత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ, వాహనాల పార్కింగ్, ఓపీ కౌంటర్ వద్ద రోగులకు సరైన వసతులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పోస్టుమార్టం గది ఆస్పత్రి ప్రధాన గేటు పక్కనే ఉండడంతో, పంచనామా సమయంలో మృతుల బంధువులు, పోలీసుల వాహనాలతో రద్దీ నెలకొంటోంది. దీంతో ఆస్పత్రిలోకి వెళ్లే రోగులు, ముఖ్యంగా చిన్నపిల్లలతో వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు. పోస్టుమార్టం గదిని ఆస్పత్రి వెనుక భాగంలోకి మార్చాలని పలువురు కోరుతున్నారు.

తీరనున్న ఇబ్బందులు..

బ్రాండింగ్ పథకంతో ఇకపై భైంసా ప్రభుత్వ ఏరియాస్పత్రిలో కార్పొరేట్ స్థాయిలో మౌలిక వసతులు అందుబాటులోకి రానున్నాయి. ఇందులో భాగంగా ఆస్పత్రి ప్రధాన ద్వారం మొదలు వాహనాల పార్కింగ్, రోగులకు ఆహ్లాదం కోసం గార్డెనింగ్, పోలీస్, సెక్యూరిటీ అవుట్‌పోస్టుల ఏర్పాటు, ఎలక్ట్రికల్, వాటర్, భవన సంబంధ మరమ్మతులు, మూత్రశాలల ఏర్పాటు, పూర్తిస్థాయి సౌకర్యాలతో ఓపీ గదులు, రిసెప్షన్ సెంటర్, తదితర వసతులు కల్పించనున్నారు. ఎలక్ట్రికల్, ఫైర్ సేఫ్టీ వ్యవస్థలు, ఆధునిక అలారంలు, భద్రతా పరికరాల ఏర్పాటు, ఐసీయూ, వార్డుల్లో తెరల ఏర్పాటు, ఆస్పత్రిలో భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.

నివేదిక రూపొందిస్తున్నాం

బ్రాండింగ్ పథకంలో భాగంగా ప్రభుత్వం భైంసా ఏరియాస్పత్రి ఎంపికైంది. ఇందులో భాగంగా ఆస్పత్రిలో కార్పొరేట్ స్థాయిలో మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయి. ఈ మేరకు టీఎస్ఎంఐడీసీ ఇంజినీరింగ్ అధికారులతో అవసరమైన వసతుల కల్పన కోసం నివేదిక రూపొందిస్తున్నారు. వారి నివేదికను టీవీవీపీ కమిషనర్‌కు అందిస్తాం.

– డా. సురేశ్, డీసీహెచ్‌ఎస్, నిర్మల్

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

భైంసాటౌన్: విత్తన వ్యాపారులు, డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని ఏఎంసీ చైర్మన్ సిందే ఆనంద్‌రావు పటేల్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఏఎంసీ సమావేశ మందిరంలో వ్యవసాయ, పోలీసు అధికారులతో కలిసి విత్తన వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నకిలీ విత్తనాలు విక్రయించవద్దని, పీసీలు తప్పనిసరిగా ఉండాలన్నారు. సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఫారూక్, ఎస్సై మహ్మద్ గౌసుద్దీన్, ఏవో రవి, డీలర్లు పాల్గొన్నారు.

పత్తి విత్తనాల నమూనాల సేకరణ

నిర్మల్ రూరల్: మండలంలోని పలు గ్రామాల్లోని విత్తన దుకాణాలలో సోమవారం ఏవో వసంత్ కుమార్ పత్తి విత్తనాల నమూనాలు సేకరించారు. కొండాపూర్, చిట్యాల గ్రామాలలో విత్తనాల నమూనాలు సేకరించి వాటి యొక్క ప్యూరిటీ, మొలక శాతం, బీటీ ప్రోటీన్ పరీక్షలకు హైదరాబాద్‌లోని ల్యాబ్ కి పంపినట్లు తెలిపారు. విత్తన డీలర్లు అందరూ నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు.



నమూనాలు సేకరిస్తున్న ఏవో వసంత్

ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన

నర్సాపూర్ (జి): ప్లాస్టిక్ నిర్మూలన ప్రతిఒక్కరి బాధ్యత అని ఎంపీవో తిరుపతిరెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరు కృషి చేయాలని కోరారు. నర్సాపూర్ (జి) గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాథోడ్ కైలాస్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎస్‌హెచ్‌జీ మహిళా సంఘం సభ్యులు , ఫీల్డ్ అసిస్టెంట్ విఠల్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీవో తిరుపతిరెడ్డి

బుద్ధ విగ్రహం తొలగించడం సరికాదు

భైంసాటౌన్: ముధోల్ మండలంలోని రాళ్ల బోరిగాంలో ఏర్పాటు చేసిన బుద్ధ విగ్రహాన్ని ప్రభుత్వ అధికారులే తొలగించడం సరికాదని విగ్రహ పరిరక్షణ కమిటీ నాయకులు అన్నారు. సోమవారం పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. గ్రామంలోని 249/అ సర్వే నంబర్‌లోగల ప్రభుత్వ భూమిలో బుద్ధ విగ్రహం ఏర్పాటు కోసం అధికారులకు విన్నవించినా స్పందించలేదని, దీంతో ఈనెల 12న బుద్ధ జయంతి సందర్భంగా విగ్రహం ఏర్పాటు చేసుకున్నారన్నారు. గ్రామస్తులు దళితులపై దాడికి పాల్పడ్డారని, అయితే, అధికారులు కేవలం బుద్ధ విగ్రహాన్ని మాత్రమే తొలగించి కుల వివక్ష చూపారని ఆరోపించారు. నాయకులు దేవిదాస్, అశోక్, దిగంబర్, శంకర్ చంద్రే, ప్రసంజిత్, లక్ష్మణ్, గిరిధర్ జంగ్మే పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేవిదాస్ హస్తే

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు

కుంటాల: మండలంలోని అందాకూర్ గ్రామంలో ఆర్‌అండ్‌బీ అధికారులు సోమవారం ప్రమాదాలు జరగకుండా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. గ్రామంలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకోవడంతో పోలీసుల సూచన మేరకు రూ.6,900 వ్యయంతో మూడు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసినట్లు ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్ తెలిపారు.

దరఖాస్తుల వడపోత

కడెం: రాజీవ్ యువవికాసం పథకం దరఖాస్తుల వడపోత జరుగుతుంది. ఎంపీడీవో కార్యాలయాల్లో స్వీకరించిన దరఖాస్తులను సిబిల్ స్కోర్ కోసం బ్యాంకులకు పంపించారు. అక్కడి నుంచి ప్రభుత్వ ఉద్యోగం, ఫోర్ వీలర్, ఎడెకరాల కంటే ఎక్కువ భూమి ఉండరాదని సర్వే నిమిత్తం పంచాయతీ కార్యదర్శులకు పంపించారు. తిరిగి కార్యాలయానికి వచ్చిన దరఖాస్తులను కులాల వారీగా, రుణాల వారీగా వేరు చేస్తున్నారు. చివరగా జిల్లా కేంద్రంలోని వివిధ కార్పొరేషన్లకు పంపనున్నట్లు జూనియర్ అసిస్టెంట్ రమేశ్ తెలిపారు.

ఇంటింటికీ ఇంకుడు గుంత



మాట్లాడుతున్న ఏపీడీ నాగవర్ధన్

లోకేశ్వరం: గ్రామాల్లోని ప్రతీ ఇంటింటికి ఇంకుడు గుంత నిర్మించుకోవాలని ఏపీడీ నాగవర్ధన్ అన్నారు. సోమవారం మండలంలోని రాయాపూర్‌కాండ్లీ గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రతీ గ్రామంలో ఉపాధిహామీ నిధులతో పశువుల పాక, గొర్రెల పాక, ఇంకుడు గుంతలు, చేపల చెరువులను నిర్మించుకునే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో రైతులు సుదర్శన్‌రెడ్డి, సాయి, ఆశన్న, దేవన్న, రమణారెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



బాసర మండల కేంద్రంలోని ప్రభుత్వం పాఠశాల 2006- 2007 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పాదాభివందనం చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని, ఆప్యాయంగా పలకరించుకున్నారు. - బాసర

శిథిల భవనాలకు రంగులు

కుభీర్: మండలంలోని రాజురా ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. గత రెండు సంవత్సరాలుగా చిన్నారులను వరండాలో కూర్చోబెట్టి బోధిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలకు నూతన భవనం కోసం రూ. 35లక్షల నిధులు మంజూరయ్యాయి. అయితే శిథిల భవనానికి రంగులు వేసేందుకు ఇటీవల కాంట్రాక్టర్ కాంట్రాక్ట్ తీసుకున్నాడు. ఏఈని, ఎంఈవోను ప్రధానోపాధ్యాయులను సంప్రదించకుండా తూతూమంత్రంగా రంగులు వేసి వెళ్లారు. పల్సి ఉన్నత పాఠశాల భవనానికి సైతం ఇదేవిధంగా రంగులు వేశారు. కూలిపోయే భవనాలకు రంగులు వేసి బిల్లులు తీసుకోవడం సరికాదని ప్రజలు అంటున్నారు. ఈ విషయమై ఎంఈవో విజయ్‌కుమార్‌ను ప్రశ్నించగా తమకు ఏమాత్రం సమాచారం లేదన్నారు. రాజురా ప్రధానోపాధ్యాయురాలు హేమలతను ప్రశ్నించగా తనకు సమాచారం ఇవ్వకుండా రంగులు వేసి, బిల్లుపై సంతకం పెట్టమని అడిగితే సంతకం పెట్టానని తెలిపారు.



బీటలు వారిన రాజురా పాఠశాల

ప్రభుత్వ పాఠశాలలోనే ఉత్తమ విద్య

లక్ష్మణచాంద: ప్రభుత్వ పాఠశాలలోనే ఉత్తమ విద్య లభిస్తుందని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో పోషకులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. దుస్తులు, మధ్యాహ్న భోజనం, ఉచిత నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు అందచేస్తున్నారని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని కోరారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

తానూరు: పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శంకర్ కోరారు. సోమవారం మండలంలోని ఎల్వి గ్రా మంలో నిర్వహించిన పోషకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తే నోట్‌బుక్స్‌తో పాటు పుస్తకాలు, రెండు జతల దుస్తులు అందించి వారికి నాణ్యమైన విద్యనందిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవ్‌రావ్, సుదర్శన్, హరీశ్, విద్యార్థుల పోషకులు పాల్గొన్నారు.

ఖానాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని పాఠశాల ఉపాధ్యాయులు అన్నారు. సోమవారం పట్టణంలోని శాంతినగర్ కాలనీలో గల ఒడ్డెవాడ ప్రాథమిక పాఠశాలలో ప్రచార కరపత్రాలు ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలతో పాటు రెండు జతల యూనిఫాంలు, సన్నబియ్యంతో భోజనం, తదితర సౌకర్యాలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శేఖర్, కాలనీవాసులు సంతోష్, నగేందర్‌రావు, రమేష్, నాగన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు మోహన్

లోకేశ్వరం: బడీడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బిలోలి ప్రభుత్వ పాఠశాలలో చిన్నారుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. ప్రతీ విద్యార్థిని పాఠశాలకు పంపించాలన్నారు.

ఉపాధ్యాయులను నియమిస్తేనే బడికి పంపిస్తాం

సోన్: మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో సోమవారం పోషకుల సమావేశం, బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని న్యూ వెల్మల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ ప్రాథమిక పాఠశాలలో 15 మంది విద్యార్థుల పేర్లు నమోదు చేసినట్లు ఉపాధ్యాయురాలు కృష్ణవేణి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. పూర్తిస్థాయి ఉపాధ్యాయులను నియమిస్తే బడికి తమ పిల్లలను పంపిస్తామన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ బొడ్డు గోదావరి, కార్యదర్శి భూపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల పేర్లు నమోదు చేస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా తిరంగా ర్యాలీ

ఖానాపూర్: ఆపరేషన్ సింధూర్ దిగ్విజయ యాత్రను పురస్కరించుకుని బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి పట్టణంలో తిరంగా యాత్రను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని స్థానిక ఐబీ చౌరస్తా నుంచి భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. పలువురు విద్యార్థులు ఆర్మీ అధికారుల వేషధారణలో ర్యాలీలో పాల్గొన్నారు. భారత సాయుధ దళాల పోరాట పటిమను అభినందిస్తూ సైనికుల ధైర్య సాహసాలను కొనియాడారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ కాసవేణి ప్రణయ్, సురేశ్, నాయకులు పాల్గొన్నారు.



జాతీయజెండాతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

భైంసాటౌన్: గ్రామంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని మండలంలోని మహాగాం గ్రామస్తులు కోరారు. సోమవారం పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని, మరమ్మతులు చేయాల్సిన హెల్పర్ స్థానికంగా ఉండడం లేదని ఆరోపించారు. దీంతో ఇబ్బంది ఏర్పడుతోందని, కొత్తగా మరో హెల్పర్‌ను నియమించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాజశేఖర్, వీరేశ్, కృష్ణ, నగేశ్, విశ్వనాథ్, సంతోష్, పోతన్న పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఊడిపోతున్న కలెక్టరేట్ సీలింగ్

నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రారంభమై రెండు సంవత్సరాలు కూడా గడవకముందే ఇంటిగ్రేటెడ్ కలెక్టర్ కార్యాలయంలో కొన్నిచోట్ల వర్షానికి తడిసి టాయిలెట్స్ వద్ద సీలింగ్ ఊడిపోతోంది. నిత్యం వివిధ పనుల నిమిత్తం కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ప్రజలు, కార్యాలయ సిబ్బంది టాయిలెట్స్ కోసం వెళ్లే క్రమంలో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సీలింగ్‌కు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

- సాక్షి, ఫొటోగ్రాఫర్, నిర్మల్



'పీఎంజేజేబీవై' సద్వినియోగం చేసుకోవాలి



చెక్కు అందిస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ ప్రశాంత్

సారంగాపూర్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి భీమా యోజన పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సారంగాపూర్ ఎస్‌బీఐ మేనేజరు ప్రశాంత్ అన్నారు. సోమవారం మండలంలోని ధని, పొట్య గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలకు రెండులక్షల రూపాయల బీమా చెక్కు అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న బ్యాంకు ఆధారిత పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవడంతో పాటు పొదుపు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది గంగామణి, తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కుంటాల: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఏఎస్సై జీవన్‌రావు సూచించారు. సోమవారం మండలంలోని కల్లూరు 61 జాతీయ రహదారిపై వాహనాలతనిఖీ చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

యూనిఫాం అందజేయాలి

లక్ష్మణచాంద: విద్యార్థులకు యూనిఫాంలను త్వరగా అందచేయాలని ప్రధానోపాధ్యాయుడు శంకర్ అన్నారు. సోమవారం పీచరలో యూనిఫాం స్టిచ్చింగ్‌ను ఆయన పరిశీలించారు. ఈనెల 30న యూనిఫాం అందచేయాలని కోరారు. విద్యార్థులకు వచ్చే నెల 12న పాఠ్య పుస్తకాలతో పాటు యూనిఫాంలను అందజేస్తామన్నారు. ఆయన వెంట సీఆర్పీ సుధాకర్, తదితరులు ఉన్నారు.